

మహిళా కార్మికులకు 'ప్రత్యేక' సెలవులివ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : ఎస్వీ గోశాలలో అగరబత్తీల తయారీలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు మూడు రోజులు తప్పనిసరిగా ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి అన్నారు. తిరుమల తిరుపతి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ గోశాలలో ఉన్నటువంటి అగరబత్తీ తయారీ కేంద్రం దర్శన్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తోంది. దర్శన్ సంస్థ మేనేజర్ రమణారెడ్డి గత కొన్ని రోజులుగా మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నాడని కొంతమంది మహిళలు మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై గజ్జల లక్ష్మి స్పందిస్తూ టిటిడి ఛైర్మన్‌ను తాడేపల్లిలోని నివాసంలో బుధవారం కలిసారు. మహిళలకు నెలసరి సమయంలో తప్పనిసరిగా మూడు రోజులు సెలవులు మంజూరు చేయాలని, సిసి కెమెరాలు విధిగా ఉండాలని, 80 మంది మహిళలు పనిచేసే చోట ఖచ్చితంగా మహిళా ఇన్‌ఛార్జిని నియమించాలని, ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలని కోరారు. ఛైర్మన్ స్పందిస్తూ దర్శన్ సంస్థ మేనేజర్ రమణారెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రూ.12వేల కోట్లు వెచ్చించి...

రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి ధర్మాన

30 లక్షల ఇళ్లస్థలాలు కొన్నాం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'పేదలకు నిలువ నీడ కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పెద్దఎత్తున భూమిని ప్రజలకు చేర్చాలన్నది జగన్ ఫిలాసఫి... అందుకే స్వాతంత్ర్య ఫలాలు ప్రజలకు అందించేందుకు 30 లక్షల ఇళ్ల స్థలాలను 12వేల కోట్లు వెచ్చించి కొనుగోలు చేశాం..' అని రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. రాయలసీమ రీజినల్ రెవెన్యూ అధికారులతో మంత్రి ధర్మాన ఓ ప్రయివేట్ హోటల్లో సమీక్షించారు. సిసిఎల్ఎ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష, ఇంటిపట్టాల పంపిణీ, డాటెడ్ ల్యాండ్స్, 22ఎ కేసులు, సదా బైనామా, మ్యూటేషన్, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, ఆక్రమణల క్రమబద్ధీకరణ, ఈ పంట నమోదు, వ్యవసాయ భూముల కన్వర్షన్ వంటి తదితర భూసంబంధ అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ 17వ శతాబ్దంలో కోల్‌కతా కేంద్రంగా ఆ శాఖ ఏర్పడిందని, తరువాత కాలానుగుణంగా ఎన్నో మార్పులకు నోచుకుందని, దేశంలోనే అత్యంత ప్రాధాన్యం ఉన్న విభాగమని అన్నారు. ఓ పౌరుడు తాను నివసించేందుకు ఇల్లు కట్టుకోవడం దగ్గర నుంచి ఆఖరికి చనిపోయేంత వరకూ ఈ శాఖ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి లక్ష్యాల మేరకు పనిచేస్తూ, ప్రతిపక్షాల విమర్శలు తిప్పికొడుతూ మన పని విధానం ఉండాలన్నారు. గ్రామాలలో అశాంతికి కారణమవుతున్న భూతగాదాల పరిష్కారానికి భూముల రీసర్వేను అత్యాధునిక పరిజ్ఞానంతో ప్రభుత్వం చేపట్టిందన్నారు. టైటిల్ ఫ్రీ ప్రాపర్టీస్ బయటకు వచ్చి వాటిపై ఇన్స్టిట్యూషనల్ ఫైనాన్స్ ఏర్పడటం వల్ల ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కలిగి పెట్టుబడులు వచ్చి రాష్ట్రం జి.డి.పి. రేటు అభివద్ధి చెందుతుందన్నారు. నిబద్ధతతో పనిచేసే అధికారులకు అండగా ఉంటామన్నారు. మొన్ననే కృష్ణా జిల్లాలో అవనిగడ్డలో పెద్దఎత్తున 35 వేల ఎకరాలను అర్హులకు భూపంపిణీ చేపట్టామన్నారు. సిసిఎల్ఎ స్పెషల్ సిఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ రీ సర్వేలో తప్పని సరిగా రైతుల భాగస్వామ్యం ఉండాలన్నారు. జిల్లాస్థాయిలో రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి పెండింగ్ లేకుండా రైతుల భూములకు పరిష్కారం చూపాలన్నారు. సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్దార్థజైన్ మాట్లాడుతూ జగనన్న భూరక్ష, భూహక్కు పథకాన్ని వివరించారు. రైతుల భూమి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అడిషనల్ సిసిఎల్ఎ సెక్రటరీ ఇంతియాజ్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా రాష్ట్రంలో దాదాపు 30 లక్షల ఇంటిపట్టాలను అందించామన్నారు. అనంతరం కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మి, పుట్టపర్తి సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, కర్నూలు జిల్లా కలెక్టర్ కోటేశ్వర్‌రావు, సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ అపరాజిత పాల్గొన్నారు.

నూతన వంగడాల రూపకల్పనలో ముఖ్యపాత్ర

కేంద్ర జలశక్తి మంత్రికి గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, క్యాంపస్

సాంకేతికంగా నూతన వంగడాలను రూపొందించడం, దేశ ఆహార భద్రతను సాధించడంలో వ్యవసాయ రంగానిది ముఖ్యపాత్రని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు గౌరవ డాక్టరేట్‌ను మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కేంద్ర మంత్రి ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం తన జీవితంలో మరచిపోని రోజుగా మిగిలిపోతుందన్నారు. దేశంలో 74 వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో ఆచార్య ఎన్జీ రంగ విశ్వ విద్యాలయం 11వ స్థానంలో ఉందన్నారు. శాస్త్రవేత్తల కృషి ఫలితంగా మన దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సంవృద్ధిని సాధించడమే గాక ఆహార ధాన్యాల వివిధ పంటల ఉత్పత్తులను ఎగుమతి స్తున్నామన్నారు. ప్రపంచ దేశాల్లో ఆహార ఉత్పత్తుల కొరకు మన దేశం వూపు చూసేలా చేయడం గర్వించదగిన విషయమన్నారు. మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో ఆచార్య ఎన్జీ రంగ విశ్వ విద్యాలయం ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. బి.పి.టి-5204(సాంబా మసూరి), ఎం.టి.యు 7029(స్వర్ణ), ఎం.టి.యు 1001(విజేత) వంటి రకాలు దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయనీ, దేశంలోనే మొదటి సారిగా వ్యవసాయ రంగంలో డ్రోన్ ల వినియోగం వంటి నూతన విధానాలను ప్రవేశ పెట్టి అనేక విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వై.ఎస్.ఆర్ రైతు భరోసా కేంద్రాలను గ్రామ స్థాయిలో రైతులకు సేవలను అందించేలా తీసుకొచ్చామన్నారు. రాష్ట్రం లో మొత్తం 10,778 రైతు భరోసా కేంద్రాలకు వ్యవసాయ విశ్వ విద్యాలయం సాంకేతిక సహకారం అందించడంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా అమలవుతున్న వ్యవసాయ కార్యక్రమాలు అన్నదాతకు తోడ్పతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, రెడ్డెప్ప, మిథున్ రెడ్డి, శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల వైస్ ఛాన్సలర్ విష్ణు వర్ధన్ రెడ్డి, శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పద్మనాభ రెడ్డి, ఆచార్య ఎన్.జి రంగ విశ్వ విద్యాలయం బోర్డు మెంబర్స్ పి.వి.ఆర్ రెడ్డి, టి.వి మురళీ నాథ్ రెడ్డి, ఆచార్య ఎన్.జి రంగ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ జి.రామారావు పాల్గొన్నారు.



విద్యుత్ కాంట్రాక్టు
కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రధాన కార్యదర్శి బాలకాశి డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాష్ట్రంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని, సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలకాశి వెల్లడించారు. సిఎం హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాలకాశి మాట్లాడుతూ ఐటి అర్హత కలిగిన ఆపరేటర్లందరికీ షిఫ్ట్ ఆపరేటర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. షిఫ్ట్ ఆపరేటర్లుగా ప్రమోషన్ పొందిన వారికి వాచ్‌మెన్ వేతనాలనే అందిస్తున్నారని విమర్శించారు. పదేళ్ల ఇంక్రిమెంట్, సర్వీసు ఇంక్రిమెంట్ అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి టి. కుమార్ గుణశేఖర్, రవి, నాగార్జున, చంగల్రాయులు, భార్గవ్, దేవరాజులు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయండి

పాదయాత్ర గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైఎస్ఆర్ కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి చేపట్టిన మహా పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకరయ్య కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా అన్నమయ్య నడయాడిన కాలిబాటను అభివద్ధి చెయ్యాలని కోరుతూ పాదయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ 20వ మహా పాదయాత్ర 18న మొదలై 21వ తేదీ ఉదయం తిరుమలకు అన్నమయ్య కాలిబాట ద్వారా చేరుకుంటారన్నారు. దాదాపుగా 10 నుంచి 15 వేల మందితో సాగే పాదయాత్రలో భజనలతో తిరుమల చేరుకుంటామన్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీరంరెడ్డి అనంత పద్మనాభరెడ్డి, లక్ష్మణ్ కుమార్, మణి, డి.శివమణి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై జెఈవో సమీక్ష

తిరుపతి సిటి : టిటిడి స్థానికాలయాల్లో జనవరి 2న ఏకాదశి పర్వదినం ఏర్పాట్లపై జెఈవో వీరబ్రహ్మం పలు విభాగాల అధికారులతో బుధవారం వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈవో మాట్లాడుతూ ఆయా ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా పది రోజులపాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలని, ఆగమ పండితులు సూచించిన మేరకు ఖచ్చితమైన వేళలు పాటించాలని కోరారు. ఆలయాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఇతర ఇంజినీరింగ్ ఏర్పాట్లు, మెరుగైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు. అన్న ప్రసాదాలు, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. భద్రతాపరంగా ఇబ్బందులు లేకుండా స్థానిక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో టిటిడి ఎస్ఇ-3 సత్యనారాయణ, ఎస్ఇ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, తిరుపతి విజివో మనోహర్, డెప్యూటీ ఈఓలు గుణ భూషణ్ రెడ్డి, గోవిందరాజన్ పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రంలో సల్మాకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర పరిశోధక విద్యార్థిని సి.సల్మాకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు పరీక్షలు నియంత్రణ అధికారి ఎం. దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ విభాగ ఆచార్యులు డాక్టర్ బి. హేమలత రుద్రమదేవి పర్యవేక్షణలో " స్టడీస్ ఆన్ స్ట్రక్చరల్ అండ్ ల్యూమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ ట్రైవలెంట్ రేర్ ఎర్త్ అయాన్స్ ఎస్ఎమ్ 3ం, ఇయు3ం, డివై 3ం, హెచ్ఒ3ం, డోపేడ్ పివిఎ/పివిపి బ్లెండ్ పాలిమర్ ఫిల్మ్స్" అనే అంశంపై పరిశోధన సమర్పించినట్లు వెల్లడించారు.

జిల్లా స్థాయి యువజనోత్సవాల పోటీలలో...
జూనియర్ కళాశాల విద్యార్థినులకు ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి - క్యాంపస్/తిరుపతి (మంగళం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి యువజనోత్సవాలలో భాగంగా తిరుపతి ఎస్ వి మ్యూజిక్, నత్య కళాశాల వేదికగా జరిగినటువంటి పోటీలలో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ఫోక్ డాన్స్ (జానపద కళా నత్యం) విభాగంలో ద్వితీయ బహుమతిని సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యువజనోత్సవాల ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ వి మురళీకష్ణ విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి దేవి అభినందించి, చదువుతోపాటు సాంస్కతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని, రాష్ట్ర జాతీయస్థాయిలో గెలుపొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు చక్కని శిక్షణ ఇప్పించిన కళాశాల అదనపు సాంస్కతిక విభాగపు అధ్యాపకులైన విజయ, సుజాత లను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ

సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచారని ఎమరాల్డ్స్ డైరెక్టర్లు విశ్వనాథ్, గిరిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. వక్తృత్వ పోటీల్లో ప్రధమ స్థానంలో హర్షిత శర్మ, ద్వితీయ స్థానంలో బంద, వన్ యాక్ట్ ప్లేలో ప్రధమ స్థానంలో లిఖిత రెడ్డి, మనస్విని, మౌనిక, యామినిప్రియా, మానస, వర్ష గ్రూప్ సాంగ్ లో ద్వితీయ స్థానంలో సాయివందన, సాయిసుధ, సాయిశ్రావణి, లావణ్య, శతి, జ్యోషిత విజేతలుగా నిలిచారన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, జానకిరామ్, నాదముని, శ్రీనివాసులు, పార్థసారథి, ప్రిన్సిపాల్ జాఫర్ వల్లీ, ఉపాధ్యాయులు, వివేక్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

కర్నూలు కేంద్రంగా న్యాయ రాజధాని కావాలి

ప్రజాశక్తి - క్యాంపస్

'ఆంధ్రప్రదేశ్ మూడు ప్రాంతాలుగా ఉంది.. అందులో రెండు ప్రాంతాలు అత్యంత వెనుక బడిన ప్రాంతాలుగా ఉన్నాయి. ఉత్తరాంధ్ర ప్రజలు న్యాయం కావాలని కోరుతూ పోరాటం చేస్తున్నారు. రాయల సీమ ప్రాంతంలో దశబ్దాల నుంచి ఉద్యమం సాగుతోంది. ఈ పరిస్థితిలో రాయలసీమ ప్రాంత వాసుల ఆత్మగౌరవం నిలబడాలంటే తక్షణం కర్నూలును న్యాయ రాజధాని చేయాలి" అంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. 1937 నవంబర్ 16వ తేదీన శ్రీభాగ్ ఒప్పందం జరిగినందున బుధవారం చంద్రగిరి శాసన సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమకు న్యాయం జరగాలని క్లాక్ టవర్ వద్ద భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు. మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోతున్న క్రమంలో జరిగిన శ్రీభాగ్ ఒడంబడిక తీర్మానం మేరకు కర్నూలును రాష్ట్ర రాజధానిగా కాకున్నా న్యాయ రాజధానిగా అయినా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బాధ్యత తీసుకుని అమలు పరచాలని డిమాండ్ చేశారు. కావాలి.. కావాలి.. కర్నూలు కేంద్రంగా న్యాయ రాజధాని కావాలంటూ నినాదాలతో హోరెత్తించారు. చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు సైతం స్వచ్ఛందంగా రోడ్డు పైకి వచ్చి కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటుకు చేయెత్తి జై కొట్టారు.

వైఎస్ఆర్ మార్గ్‌లోని డిపిఆర్ హాలులో శ్రీభాగ్ ఒప్పంద దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపి గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు. కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రాజధానులకు మద్దతుగా సమావేశాన్ని నిర్వహించి శ్రీభాగ్ ఒడంబడిక ఒప్పందాన్ని ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, రాయలసీమ సమితి పురుషోత్తం పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూసమస్యను పరిష్కరించాలి : సిపిఐ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : పేదల ఇళ్లకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా శెట్టిపల్లి భూబాధితులు మూడువేల మందికి పైగా రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కరించలేదన్నారు. తిరుపతి రూరల్ దామినేడు ప్రభుత్వ గృహాల పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి నాలుగ ఎకరాల 20 సెంట్ల భూమిని కొంతమంది భూకబ్జాదారులు అన్యాక్రాంతం చేసి ప్రైవేట్ వ్యక్తులకు 'ఫోర్డ్' కంపెనీతో కుమ్మక్కయ్యి షెడ్లేసి కార్ల వ్యాపారం చేస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ భూమిని కాపాడి ప్రజా అవసరాల కోసం ఉపయోగించాలని కోరారు. తక్షణమే ఫోర్డ్ కార్ల కంపెనీ తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నం పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో...

తిరుపతి జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బుధవారం ఆంధ్రప్రదేశ్ జిల్లా రెవిన్యూ శాఖ మాత్యులు ధర్మాన ప్రసాద రావును , సిసిఎల్ఎ ఐఎఎస్ సాయి ప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ ఎస్ . శివప్రసాద్ , కార్యదర్శి పి. గోపీనాథరెడ్డి , కోశాధికారి రూపేచంద్, ఉపాధ్యక్షులు అన్వర్ బాష, తిరుపతి డివిజన్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, కోశాధికారి సి. జీవన్, శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి ఏ.కే. ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

చిందేపల్లి నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న ఇళ్ళ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. చిందేపల్లి లే అవుట్లో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణ పనులను బుధవారం కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించారు. కమిషనర్ అనుపమ లే అవుట్ ఇన్ చార్జ్ డిఈ గోమతితో మాట్లాడుతూ తిరుపతి నగరంలోని అర్హులైన ప్రజలకు నిర్మిస్తున్న ఇళ్ళ నిర్మాణ పనులకు అవసరమైన కూలీల సంఖ్యను పెంచడంతోబాటు, పనులకు అవసరమైన ఇటుకలు, ఇసుక, కమ్మి, సిమెంటుకు లోటు రాకుండా ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటిని లక్షా 80 వేలతో నిర్మించి ఇవ్వడంతో పాటు ప్రతి ఒక్క ఇంటికి అదనంగ వ్యక్తిగత లోన్ సహాయంతో మరో 35 వేల రూపాయాలను వారి యొక్క ఇంటి నిర్మాణానికి అదనపు ఖర్చు కింద అందిస్తున్న విషయాన్ని లబ్ధి దారులకు వివరించాలని కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. ఈ కార్యక్రమంలో చిందేపల్లి లే అవుట్ డిఈ గోమతి, అమ్నెటి సెక్రటరీలు పాల్గొన్నారు.

విదేశీ విద్యా అవకాశాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విదేశాలలో విద్య అవకాశాలపై తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. అమెరికాకు చెందిన ఐక్లౌడ్ టెక్నాలజీస్, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ(ఆపిట) సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఐక్లౌడ్ టెక్నాలజీస్ నుండి ముఖ్యఅతిథిగా హాజరైన కిషోర్ మాట్లాడుతూ విదేశాలలో ఉన్న విశ్వవిద్యా లయాలలో విద్యా కోర్సులలో ఎలా చేరాలి, స్కాలర్‌షిప్, రాత పరీక్షలు వంటి ప్రక్రియలను ఎలా అధిగమించాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, చిత్తూరు డివిజనల్ మేనేజర్ పి.లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి

రాయలసీమ అభివృద్ధికి ఐక్య ఉద్యమం

- సదస్సులో సిపిఎం పిలుపు
- పది అంశాలపై తీర్మానం

ప్రజాశక్తి-అనంతపురం

అత్యంత వెనుకబడిన రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఐక్య ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం రాయలసీమ సదస్సులో తీర్మానించారు. 'రాయలసీమ సమగ్రాభివృద్ధి-ఆటంకాలు' అన్న అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలోని గుంతకల్లు పట్టణంలో రెండు రోజుల పాటు సదస్సు జరిగింది. ఈ సదస్సు బుధవారం ముగిసింది. అనంతరం సదస్సులో చర్చించిన అంశాలు, తీర్మానాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల సదస్సుల్లో రాయలసీమ వెనుకబాటుతనం, సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పది అంశాలపై తీర్మానాలు చేశారు. తీర్మానాల వివరాలు ఈ విధంగానున్నాయి.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

- రాయలసీమ సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలకోట్లు కేటాయించాలి. మూడు సంవత్సరాల్లో ఈ నిధులు ఖర్చు పెట్టాలి.
- రాయలసీమలోని ప్రతిపాదిత ప్రాజెక్టులన్నీ మూడు సంవత్సరాలలో పూర్తిచేయాలి. ఈ ప్రాంత సాగుభూమికి సంవత్సరానికి ఒక పంటకైనా నీరివ్వాలి.
- రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 20 సంవత్సరాలు పన్ను రాయితీ కల్పించాలి.
- కడప జిల్లాలో ప్రభుత్వరంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి.
- అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసిన్ సంస్థలు పూర్తి చేయాలి. కర్నూలులో రూ.400 కోట్లతో ట్రిపుల్‌ఐటి, రైల్వేకోచ్ నిర్మాణ పరిశ్రమ స్థాపించాలి. తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్ హామీ అమలు చేయాలి.
- వృత్తిదారులకు రక్షణ కల్పించాలి. చేనేతలో 11 రకాల రిజర్వేషన్లు అమలుచేయాలి. ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ పటిష్టంగా అమలు జరపాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా ఈ తరగతుల అభివృద్ధికి, స్వయం ఉపాధికి నిధులు కేటాయించాలి
- హంద్రీనీవాకు 80 టిఎంసిలు నీరు కేటాయించాలి. పిల్ల కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరివ్వాలి.
- రాయలసీమలో మైనింగు ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. మైనింగు ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం రాయలసీమ ప్రాంతాభివృద్ధికి కేటాయించాలి
- గత ప్రభుత్వ శాసనసభలో రాయలసీమకు ప్రకటించిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయడంతోపాటు, కొత్త పరిష్కార చర్యలను చేపట్టాలి.
- కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాల ప్రభుత్వ భూములను అప్పజెప్పే విధానాన్ని ఆపాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మిగులు భూమిని పేదలకు పంచాలి.

కెవిపిఎస్ మండల కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా శ్యామ్, కార్యదర్శిగా సెల్వరాజ్ ఏకగ్రీవం

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) మండల మహాసభ బుధవారం కె.సెల్వరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రేణిగుంట మండలంలో హరిజన, గిరిజనవాడల్లో అగ్రవర్ణాల పెత్తందారుల దాడులు- చిన్నపిల్లల, మహిళలపై అత్యాచారాలు- కుల వివక్షతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలపైన సమీక్ష నిర్వహించారు. అనంతరం కెవిపిఎస్ రేణిగుంట మండల కమిటీ 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా శ్యామ్, ఉపాధ్యక్షులు ప్రసాద్, ప్రధానకార్యదర్శిగా సెల్వరాజ్, సహాయ కార్యదర్శిగా సుభాష్, కోశాధికారిగా చీరాలయ్య/ యశ్వంత్, కమిటీ సభ్యులుగా వేణు, రేనయ్య, కుమార్, మునిరాజమ్మ, కళావతి, శిరీష, కుమార్ రాజా నూతనంగా ఎన్నికయ్యారు.

పశువుల పేడను తొలగించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని హరహర బావి-ఎస్టీకే నగర్ వీధిలో పశువుల పేడను తొలగించాలని హరహర బావి వీధికి చెందిన వైసీపీ నేత హరినాథ నాయుడు బుధవారం మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరినాథ నాయుడు మాట్లాడుతూ హరహర బావి వీధిలో ఉన్న మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివేందుకు స్థానికంగానే కాకుండా ఎస్టికే నగర్ నుండి ఎంతోమంది పేద విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారని చెప్పారు. అయితే ఈ ప్రాంతంలో ఉన్న పశువులు దారి వెంబడి పేడ వేస్తుండడంతో విద్యార్థులు జారిపడుతున్నారని వాపోయారు. అదేవిధంగా వృద్ధులు సైతం జారిపడుతూ గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల పెంపకందారులు పేడను తొలగించేలా అధికారులు ఆదేశాల జారీ చేయాలని కోరారు.

దళిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని కరకంబాడి గ్రామ సచివాలయం పరిధిలోని తారకరామా నగర్ లో కాపురం ఉంటున్న విజయ్‌కుమార్ (45) అనారోగ్య కారణంగా మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జ్ పవిత్ర రెడ్డి సూచనల మేరకు ఎమ్మెల్యే తనయుడు ఆకర్ష రెడ్డి మృతుని భార్య ఈశ్వరమ్మను పరామర్శించి, నివాళులు అర్పించారు. అనంతరం దహన క్రియల నిమిత్తం రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. తారకరామా నగర్ ఇన్‌చార్జ్ మన్యం శ్రీనివాసులు రెడ్డి (ఎమ్మెస్సార్), ఎంపిటీసీ మల్లెల కన్నయ్య, నాయకులు హరి, వాసు, రమేష్, రవీంద్ర రాజేష్, కాలేశా ఉస్మాన్, అమ్ములు, తులసి, సుధారాణి, లతా, వార్డు మెంబర్లు సి.సావిత్రి తహసీన, షాహిదా విజయలక్ష్మి, శోభ, జిలాని, బాబ్జి, ఇంతియాజ్, రమణ, శ్రావణ్ నివాళులు అర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పోరాటం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం పోరాటం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం పవన్ కళ్యాణ్ కృషిచేస్తున్నారని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అన్నారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు సోమవారం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పై చేసిన విమర్శలను వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం గూడూరు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో టీం పిడికిలి రూపొందించిన ఇక తగ్గేదే లే" నినాదంతో ఉన్న గోడ పత్రికలను జనసేన పార్టీ నాయకులు విడుదల చేశారు. జనసేన పార్టీ చిల్లకూరు, చిట్టమూరు, వాకాడు మండలం నాయకులు అక్బర్ కుమార్, మనోజ్ కుమార్, గోపాలరెడ్డి, శంకర్, సాయి, శివ, శివమణి, శ్రీనివాసులు, ముత్యాలు, మోహన్, వెంకయ్య, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పట్టణంలోని సెంట్రల్ రైల్వే విజయవాడ రైల్వే డివిజన్ గూడూరు రైల్వే డాక్టర్ శ్రీనివాస్ సుందర్ కుమార్ ఆధ్వర్యంలో నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు క్యాన్సర్ మీద ఇతర జబ్బులు రాకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో రైల్వే డాక్టర్ శ్రీనివాస సుందర్ కుమార్, మెడికవర్ డాక్టర్స్, ముఖ్యఅతిథిగా సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్‌యుసిసి మెంబెర్ బి.శ్యామ సుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) పాల్గొన్నారు

వెంకటసుబ్బయ్యకు మందులు పంపిణీ

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని ఇలగనూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య మూత్రపిండాల వ్యాధితో గత కొద్ది రోజులుగా బాధపడుతున్నాడు. అతను నిరుపేద కావడంతో మందులు కొనడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాడు. ఆయన అనారోగ్య పరిస్థితి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి తెలియడంతో స్పందించిన ఆయన శ్రీకాళహస్తి పట్టణం లోని నంద మెడికల్స్ అధినేత నరసింహులు దాతృత్వంతో వెంకటసుబ్బయ్యకు ఐదు నెలలకు సరిపడే మందులు ఉచితంగా అందజేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

వైసీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -సత్యవేడు: ప్రతి పాఠకుడు గ్రంథాలయ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు వైసీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి కోరారు. గ్రంథాలయ వారోత్సవాలు పరిష్కరించుకుని బుధవారం గ్రంథాలయ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో గ్రంథాలయ ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ రవి, సింగిల్ విండో అధ్యక్షులు నిరంజన్ రెడ్డి,మాస్టర్ స్కూలు అధినేత, మండల వైఎస్ఆర్సిపి నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి,బెల్ట్ రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుశీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిజిటల్ లైబ్రరీలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. .ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ మోహన్ రెడ్డి,మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, వ్యవసాయ మండల సలహా సంఘం చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి సర్పంచులు రవిరెడ్డి, శేఖర్, వైసీపీ నేతలు గురుప్రసాద్, రమణ గురునాథం, కుమార్, రాబర్ట్, మునికృష్ణయ్య, కుమార్, గురునాథం, వంశి రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట: అంతర్జాతీయ 55వ గ్రంథాలయ వారోత్సవాల వేడుకల్లో భాగంగా నాయుడుపేట గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. 18,19 తేదీలలో విద్యార్థిని, విద్యార్థులచే వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎస్ కె. అతావుల్ల చెప్పారు. 20వ తేదీ వారోత్సవాలు ముగింపు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారోత్సవాలకు నాయుడుపేటలోని ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్ అన్నింటిని ఆహ్వానించామని ఉపాధ్యాయులతో పాటు స్కూల్ పిల్లలు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొనటం తమకు మరింత ఉత్సాహం కలుగజేస్తుందని తెలియజేసారు. పట్టణంలోని వివిధ పాఠశాలల పిల్లలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్: విద్యార్థులు గ్రంథ పఠనం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవచ్చని. విశ్రాంతి ఉద్యోగి బాబు నాయుడు తెలిపారు. పుత్తూరులోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మీనా కుమారి ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు అయ్యంకి రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, గ్రంథాలయ శాస్త్ర ప్రముఖుడు ఎస్సార్ రంగనాథం వారిని స్మరించుకొని సభ ఏర్పాటు చేశారు రిటైర్డ్ ఉద్యోగులు, శంకర్ రాజు. బి వెంకటరణ. ఎస్ సుధాకర్ రాజు. పాఠకులు శ్రీనివాసులు. శంకరయ్య, సుధాకర్ రాజు, శంకర్ రాజు, జయంతి లక్ష్మీపతి. పిఎస్ శ్రీనివాస్. గంగాధర్ రెడ్డి, లక్ష్మీపతి, శేఖర్ రాజు, చాంద్ బాషా, చిరంజీవి, గ్రంథాలయ సిబ్బంది సుజాత పాల్గొన్నారు.

తిరుచానూరులో.. తిరుచానూరు గ్రాంథాలయంలో గ్రాంథాలయాల అభివృద్ధికి ఉన్నతికి ఉద్యమించిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, వెంకట్రామయ్య గురించి చర్చించుకున్నారు. విశ్రాంతి తెలుగు పండిట్ రాధాక్రిష్ణయ్య, ఉపాధ్యాయలు సునీత, గ్రంథాలయాధికారి నాగరాణి, విద్యర్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరులో ఉద్యమకారులను స్మరించుకుంటున్న దృశ్యం

కబ్జా నుండి శ్మశానాన్ని కాపాడండి : కెవిపిఎస్ ధర్నా

ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని తడుకు పంచాయతీ ఎగవగూళూరులో శ్మశానం కబ్జా నుండి కాపాడండని పుత్తూరు అంబేద్కర్ విగ్రహం నుంచి పుత్తూరు తహశీల్దార్ కార్యాలయం వరకు కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ఆర్ వెంకటేష్ దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య మాట్లాడుతూ సిరిగిరాజుపాలెం లెక్కదాకాల్లో ఉన్న సర్వే నంబర్ 89లో ఎగువగుళూరు గ్రామస్తులు శ్మశానానికి ఉపయోగించుకుంటున్నారు. సిరుగురాజు పాలెం పంచాయతీ సర్పంచ్ డి.మురళి మోహన్ ఆయన అనుచరులు ఐ.శాంతి తండ్రి వెంకటముని ఆ భూములను కబ్జా చేసి డీకేటి పట్టా పాస్‌బుక్ చేసుకున్నారని, ఇందుకు సహకరించిన రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూములను పూర్తిగా సర్వే చేసి ఎగువగుళూరు దళితవాడకు శ్మశానానికి కేటాయించాలన్నారు. లేని పక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన తహశీల్దార్ సర్వే నిర్వహించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కెఆర్ సుబ్రహ్మణ్యం పిళ్ళై, పురుషోత్తం, వి.గోపాల్, టీ.మన్నార్, వి మురుగయ్య, టి.ఆదయ్య, ఏ.రామ్మూర్తి, టీ.పెరుమాళ్ టి.సదాశివయ్య, ఈ శివయ్య, ఎస్.లక్ష్మి, కే.విజయ, తిలోతమ్మ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే కిలివేటి

ర్యాలీ మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ప్రజాశక్తి-నాయుడుపేట: వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధిస్తుందని సూళ్లూరుపేట శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం నాయుడుపేట పట్టణంలో స్థానిక వైసిపి నాయకులతో కలసి ఆయన వికేంద్రీకరణకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం మన సీఎం జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు ఆరాటపడుతుంటే ప్రతి పక్షాలు అవసరం లేని రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఏ ప్రాంతానికి గతంలో జరిగిన అన్యాయం జరగకూడదన్న ఆలోచనతోనే ఈ మూడు రాజధానులు చేస్తున్నారని అన్నారు. నాయుడుపేట వైసిపి మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎంపిపి కురుగొండ్ల.ధనలక్ష్మి, మునిసిపల్ ఛైర్‌పర్సన్ కటకం.దీపిక, వైస్ చైర్మన్ జె.వెంకట కృష్ణారెడ్డి, శ్రీపోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గందవల్లి.సిద్దయ్య, మునిసిపల్ కౌన్సిలర్లు దారా.రవిబాబు, పాలేటి. నాగార్జున, షేక్ షబ్బీర్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ కరీంబాయ్ చెంచయ్య, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: మూడు రాజధానులు ముద్దు.. ఒక రాజధాని వద్దు.. వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల అభివృద్ధి అంటూ పట్టణంలో బుధవారం వైసీపీ నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. చంద్రబాబుకు మూడు రాజధానులంటే ఎందుకిష్టం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతిలో రాజధాని కట్టాలంటే రూ.5 లక్షల కోట్ల అవసరం ఉందనీ, ఆ డబ్బును చంద్రబాబు ఇస్తాడా..? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు మూడు రాజధానులకే మద్దతిస్తున్నారనీ, అభివృద్ధి వికేంద్రీకరణే జరగాలని కోరుకుంటున్నారని కితాబిచ్చారు. పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బియ్యపు

రాయలసీమ రేంజ్ డిఐజి, ఎస్పీలకు జర్నలిస్టుల సన్మానం

ప్రజాశక్తి-రేణిగుంట: రాయలసీమ రేంజ్ డీఐజీ రవి ప్రకాష్‌ని, అలాగే తిరపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిలను రేణిగుంట జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. సాధారణ తనిఖీలు భాగంగా బుధవారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన డిఐజి రవి ప్రకాష్, జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా రేణిగుంట జర్నలిస్టులు శివమూర్తి, సుబ్రహ్మణ్యం, వరప్రసాద్, పి.నిషార్హమ్మద్ యాసీన్, మోహన్ నాయుడు, రమేష్, కిరణ్, హరీష్, అప్సర్, ముని రామయ్య, వినోద్‌లు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం డిఐజి రవి ప్రకాష్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి రేణిగుంట జర్నలిస్టులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి రామచంద్ర.సీఐ ఆరోహణరావు, గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి వడమాల పేట ఎస్ఐ రామాంజనేయులు, కానిస్టేబుళ్లు, తదితరులు ఉన్నారు.

పాకాల: ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ప్రభుత్వ వ్యవస్థలను నడిపించేది పత్రిక మీడియా రంగమేనని పాకాల ఎస్ఐ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాకాల ఎస్.ఐ రామకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ నవంబర్ 16న పత్రిక దినోత్సవ సందర్భంగా పత్రికా, మీడియా విలేకరుల అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించడంతో పాటు ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియజేయడంలో పాత్రికేయుల కృషి అభినందనీయమని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు ప్రభుత్వం దృష్టికి చేరవేస్తూ న్యాయం జరిగేందుకు జర్నలిస్టులు చేస్తున్న కృషి మరువలేనిదని తెలిపారు.

మోడ్రన్ విలేజ్‌గా మార్చడమే లక్ష్యం

కారూరు సర్పంచ్ జి. నిత్యాసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-తడ: మండలంలోని కారూరు గ్రామం, గ్రామ పరిధిలోని పంచాయతీని మోడ్రన్ విలేజ్‌గా మార్చడమే లక్ష్యమని గ్రామ సర్పంచ్ జి.నిత్యాసుందర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రయత్నంలో భాగంగా గ్రామానికి విశాలమైన సిమెంట్ రోడ్, బీట్ రోడ్ మరి కొంత భాగం గ్రావెల్ రోడ్లను వేయిస్తున్నారు. వీటికి గాను కారూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కాశింకాడ్ కుప్పంలో నేషనల్ హైవే నుండి పడవల రేవు వరకు కోటి 38 లక్షలతో సిమెంట్ రోడ్‌ను వేసారు. అలాగే కారూరు గ్రామంలోనికి ప్రవేశించడానికి 30 అడుగుల వెడల్పుతో 2కిలోమీటర్ల సిమెంట్ రోడ్డును 93 లక్షలతో అలాగే 30 అడుగుల వెడల్పుతో 1 కిలోమీటర్ల 600 మీటర్ల బీటా రోడ్, గ్రామ శ్మశానంలోకి 30 అడుగుల వెడల్పుతో 1 కిలోమీటర్ల 300 మీటర్ల గ్రావెల్ రోడ్ పనులు జరుగుతున్నాయి. అలాగే గ్రామానికి మూడు లైన్లతో విద్యుత్తు, ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనిలో భాగంగా స్తంభాలు, విద్యుత్ తీగల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం పనులు కూడా పూర్తయినట్లు తెలిపారు. తాగునీటి కోసం ఇంటింటికి కొళాయిల నిర్మాణం కోసం పైప్‌లైన్‌లు వేసి ప్రతి ఇంటికి కొళాయిలను ఏర్పాటు చేశారు. నీటి కోసం మొత్తంగా 5 బోర్లను వేసినట్లు తెలిపారు. గ్రామంలో పచ్చదనం కోసం చెట్లను నాటి పెంచడం గ్రామాన్ని పరిశుభ్రంగా వుంచడం కోసం డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లా సెక్రటరీ సత్య ప్రకాష్, టీటీడీ ఎక్స్ జేఈవో బసంత్ కుమార్ కుటుంబసమేతంగా వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద సూపరింటెండెంట్లు శేషగిరి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -గూడూరు రూరల్: గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నరశింగరావు పేటలోని బాలసదన్‌లో వి.గోపాలకృష్ణ మూర్తి జ్ఞాపకార్థం రొటేరియన్ ఎస్.వి.జి. ప్రసాద్ దాతృత్వంతో పిల్లలందరికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలసదన్ కేర్‌టేకర్ అరుణ కోరికపై రొటేరియన్ వల్లంకొండ గోపాల కృష్ణమూర్తి కుమారుడు వల్లంకోండ ప్రత్యూష కుమార్ టెలివిజన్ బహుకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కిరణ్ చక్రవర్తి, పి.డి.జి.కె. మునిగిరిష్ ,సీనియర్ రోటేరియన్లు : బి. దశరథ రామి రెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్, పి.వి.కృష్ణయ్య, బి.శ్రీధర్ రెడ్డి, పి.వి. మోహన్ రెడ్డి, పి.మునిరాజా, యస్. వి. జి. ప్రసాద్, ఎన్.వి. రత్నం. బాలసదన్ ఉద్యోగులు, బాలలు పాల్గొన్నారు.

లీకేజీలకు శాశ్వత మరమ్మతులు చేయించండి



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: వర్షాలకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో లీకేజీలు కాకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని హిందూ ధార్మిక మండలి సభ్యులు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులను బుధవారం కోరారు. కార్తీక మాసంలో వర్షాలు ఎక్కువగా పడుతుంటాయనీ, వర్షపునీటితో నానిన మండపాల వలన భక్తులకు ఏదేని ప్రమాదం జరిగితే ఆలయ ప్రతిష్టకు భంగం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. అలాంటి పరిస్థితులు ఎదురు కాకముందే శాశ్వత నివారణా చర్యలు చేపట్టాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ సచివాలయం పరిధిలో కసింకుప్పం జగనన్న కాలనీలో ఐదు పనులకు స్లాబ్, రామకృష్ణాపురం పంచాయతీలో మూడు, రూ.8 లక్షలు మంజూరయ్యాయి. బుధవారం సర్పంచ్ విరిత దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి అవకతవకలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై అధికారుల తనిఖీ

ప్రజాశక్తి -కోట : మండల పరిధిలోని కోట బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మండలాధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోట మండల అభివృద్ధి అధికారి భవాని, ఎంఈఓ సునీల్ కుమార్, జెడ్పిటిసి దాసరి కోటయ్య, ఎంపీపీ దాసరి అంజమ్మ, ఉప ఎంపీపీ శేషయ్య గౌడ్, కో-ఆప్షన్ మెంబర్ షేక్ మోయిన్ బాష అందరూ కలిసి పిల్లలకు భోజనం వడ్డించారు. అదేవిధంగా భోజనం స్థితిగతులను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో దాదాపు 370 మంది విద్యార్థినిలు భోజనం చేస్తున్నారని ఇక్కడ మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారమే రుచికరమైన, నాణ్యమైన భోజనం అందిస్తున్నారని వారు తెలియజేశారు. అదేవిధంగా పాఠశాలలో వంటగది నాసిరకంగా ఉందని భోజనం తయారు చేయుటకు ఇబ్బందికరంగా ఉందని పాఠశాల సిబ్బంది ఎంపీడీవో భవానికి, ఎంఈఓ సునీల్ కుమార్‌కు తెలియజేశారు. ఈ సమస్యను త్వరగా పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటముని రెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని తొట్టంబేడు పంచాయతీ బంగారమ్మ కాలనీకి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు చీరల వెంకట మునిరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం పొలంలోకి వెళ్లి పాము కాటుకు గురయ్యాడు. అక్కడ తమ తోటలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలు చెక్కల మందు తాగించి వారిని కాపాడి శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. అనంతరం పాము కాటుకు పేరుగాంచిన దివంగత డాక్టర్ రేణిగుంటకు చెందిన బషీర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న చీరల వెంకట మునిరెడ్డిని తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు, మాజీ సర్పంచ్ మధు నాయుడు, వాణిజ్య విభాగం నాయకులు కమలాకర్ నాయుడు, వ్యాపారవేత్త సునీల్ కుమార్ రెడ్డి పరామర్శించారు.

నాణ్యమైన జీవనానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి- పుత్తూరుటౌన్: నాణ్యమైన జీవనం గడపడానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ విశ్రాంత ప్రధానాచార్యులు చిట్టిబాబు పేర్కొన్నారు. పుత్తూరు తాలూకా విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షులు భాస్కర్ రాజు ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శిక్షణ సంస్థ కార్వేటినగరం విశ్రాంత ప్రధానాచార్యులు చిట్టిబాబు, తిరుపతి స్టార్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ వంశీకృష్ణ, ఎన్జీవో అధ్యక్షులు గిరిబాబు, కార్యదర్శి శశిధర్ రెడ్డి, కోశాధికారి నాగజ్యోతి, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ కొన్ని విలువలు కోసం మనం కట్టుబడాల్సి ఉంటుందన్నారు. అనంతరం పుత్తూరులో పెన్షనర్లతో కలిసి మాట్లాడుకోవడం మంచి పరిణామం అన్నారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమాజ హితం కోసం పనిచేసి సుపరిపాలన ఉండే విధంగా పాలకులకు మార్గదర్శకం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి, సంఘ బాధ్యులు కుప్పయ్య, బిసిఎస్ వర్మ, రామమూర్తి, కృపావరమ్మ, రామచంద్ర రాజు, మేకలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శ్రీపద్మావతి అమ్మవారికి

20 వెండి కలశాలు వితరణ

ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీ పద్మావతీ (అలమేలుమంగ) తాయార్ కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా అమ్మవారి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన దాత అమిత్ అగర్వాల్ సుమారు 6.70 లక్షలు విలువ గల 20 వెండి కలశాలను ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి ఆలయ అర్చకులు బాబు స్వామికి అందజేశారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమ సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఏవీఎస్ఓ శైలేంద్రబాబు, విఐ రామ్మోహన్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు దాము, తల ప్రసాద్, అశోక్, ప్రధాన అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

నేడు వరవ కాలువ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని పెద్ద కనపర్తి, పిల్లమేడు, చియ్యవరం, కాసరం గ్రామాలలో గురువారం ఉదయం 9 గంటలకు ఆయా గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న వరవ కాలువ పూడిక తీత పనులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యం పవిత్ర రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామస్తులు ఉపాధి హామీ సిబ్బంది హాజరవ్వాలని ఏపీవో సుజాత తెలిపారు.

25న బార్ అసోసియేషన్ ఎన్నికలు

చిత్తూరుఅర్బన్: చిత్తూరు న్యాయవాద సంఘం ఎన్నికలు ఈనెల 25న నిర్వహించనునట్లు ఎన్నికల అధికారి ఎం.ఎస్. యోగానంద్ తెలిపారు. బుధవారం చిత్తూరు బార్ అసోసియేషన్ వద్ద ఆయన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించారు. అధ్యక్ష పదవికి డి రాజేందర్ రెడ్డి, పి రమేష్, ఉపాధ్యక్ష పదవికి ఎం ఆనంద్, జి.ఆర్. గిరిధరన్, ఎం.రాజేశ్వరి, యు.విశ్వనాథ్ పోటీ పడుతున్నారు. కార్యదర్శి పదవికి అశోక ఆనంద్, జానకిరామిరెడ్డి, లోకనాథం, సత్యమూర్తి, కోశాధికారి పదవికి దేవేంద్రనాథ్, వెంకటపతి నాయుడు, స్పోర్ట్స్ సెక్రటరీ పదవికి లక్ష్మీకాంత్, సుబ్రహ్మణ్యం పోటీ చేస్తున్నారు. లైబ్రరియన్ పదవికి షఫీరుల, వరదరాజులు, ఈసీ మెంబర్ (జూనియర్) పదవులకు బ్రహ్మయ్య, దయాకర్, హరి ప్రసాద్, శివయ్య, వెంకటరమణ, వెంకటేశన్ బరిలో ఉన్నారు.